క్లుప్తంగా

మత్తు పదార్థాల జోలికి వెళ్లొద్దు



మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలంటూ అవగాహన కల్పిస్తున్న దృశ్యం

భీమవరం: మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని భీమవరం వన్ టౌన్ సీఐ నాగరాజు అన్నారు. పోలీస్ ఈగల్ ఆధ్వర్యంలో భీమవరం వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలంటూ అవగాహన ర్యాలీ నిర్వహించారు. సీఐ నాగరాజు మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లల అలవాట్లు కదలికలపై జాగ్రత్తగా వ్యవహరించాలని, చెడు మార్గాల వైపు వెళ్లకుండా చూసుకోవాలన్నారు. మత్తు పదార్థాల వల్ల యువత శారీరకంగానూ, మానసికంగానూ తీవ్రంగా బలహీన పడిపోతారని, భవిష్యత్తు నాశనం అవుతుందన్నారు. మత్తు పదార్థాలు సరఫరా చేసినా, అమ్మినా, సేవించినా చట్టపరమైన శిక్షలకు గురవుతారన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు కిరణ్, కృష్ణాజీ, బిసి హాస్టల్ వార్డెన్ కడలి శ్రీనివాస్, కానిస్టేబుల్స్ పాల్గొన్నారు.

హెలెన్ కెల్లర్ జయంతి



డాక్టర్ ఐశ్వరను సత్కరిస్తున్న దృశ్యం

భీమవరం: హెలెన్ కెల్లర్ జీవితం ఆదర్శప్రాయమని పలువురు వక్తలు కొనియాడారు. ఆదివారం స్థానిక ఎస్‌సీహెచ్‌బీఆర్ఎం పాఠశాల నందు సక్షమ్ పశ్చిమ గోదావరి జిల్లా ఆధ్వర్యంలో సక్షమ్ స్థాపనా దివస్ హెలెన్ కెల్లర్ జయంతులను ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ప్రముఖ వైద్యనిపుణులు డాక్టర్ ఐశ్వర్య పాల్గొని మాట్లాడారు. సక్షమ్ కార్యకలాపాలు, హెలెన్ కెల్లర్ జీవితం గురించి వివరించి దివ్యాంగులలో ఉత్సాహం నింపారు. డా.ఐశ్వర్య, అరుణోదయ పాఠశాల ప్రిన్సిపాల్ అరుణను ఘనంగా సన్మానించారు. అనంతరం దివ్యాంగ విద్యార్థులకు పలకలు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో శ్రీమన్నారాయణ, కె.ఎస్.కె.ఎస్. అప్పారావు, సుగ్రీవ్ గారు, నాగ వర్ధిరాజు, సక్షమ్ కార్యకర్తలు పాల్గొన్నారు.

వెంకటేశ్వరస్వామికి వెండి ఆభరణాలు సమర్పణ



వెంకటేశ్వరస్వామికి వెండి ఆభరణాలు సమర్పిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం హౌసింగ్ బోర్డ్ కాలనీ పద్మావతి సమేత వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో రూ.32,000 విలువ గల వెండి ఆభరణాలు భక్తులు సమర్పించారు. కొయ్యాని వెంకన్న కృష్ణవేణి దంపతులు రజిత వరదహస్తం, రజిత కటిహస్తం సుమారు 220 గ్రాములు వెండితో చేయించిన వస్తువులను ఆలయ అధ్యక్షుడు కంతేటి వెంకట రాజుకు అందజేశారు. ఆలయ అర్చకులు పాణింగిపల్లి శ్రీనివాసాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించి వేద ఆశీర్వచనం అందజేశారు. ఈ కార్యక్రమంలో దాతల కుటుంబ సభ్యులు, ఆలయ సిబ్బంది కడలి ఫణి కుమార్ పాల్గొన్నారు.

బాలాత్రిపుర సుందరీదేవికి విశేష పూజలు



విశేష అలంకరణలో బాలా త్రిపుర సుందరిదేవి అమ్మవారు

భీమవరం (ప్రకాశంచౌక్): పట్టణంలోని మెంటే వారితోటలో బాలా త్రిపురసుందరీ దేవికి విశేష పూజలు జరిగాయి. ఈ సందర్భంగా అమ్మవారికి శాకంబరీ దేవిగా ప్రత్యేకంగా ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అభివృద్ధి కమిటీ పర్యవేక్షణలో ఆలయ అర్చకులు కొమ్ము శ్రీనివాస్ అధ్వర్యంలో పట్టణానికి చెందిన మాజీ కౌన్సిలర్ నందమూరి ఆంజనేయులు దంపతులు, కదలి సుబ్రహ్మణ్యం (బాలు) దంపతులచే అమ్మవారికి కుంకుమ పూజలు, అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పూజలను చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

వైభవంగా వాసవీ హోమం

పెనుగొండ: అఖిల భారత శ్రీవాసవీ పెనుగొండ టెంపుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలోని వాసవీ శాంతి ధాంలో వాసవీ హోమం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆదివారం ఉదయం నుంచి ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడేనికి చెందిన భక్తులు వాసవీధాంలో గోపూజ, అర్చనలు నిర్వహించారు. అనంతరం 102 అడుగులు ఋషీ గోత్రమందిరంలోని 92 అడుగుల వాసవీ కన్యకపరమేశ్వరి పంచలోహ విగ్రహాన్ని దర్శించుకుని, మరకత శిల వాసవీ మాతకు అభిషేకంలు నిర్వహించారు.

తల్లికి వందనం ప్రచారమే..

అర్హులకు అన్యాయం
నిబంధనలతో పథకానికి తూట్లు
- అయోమయంలో తల్లిదండ్రులు
- వేర్వేరు కారణాలతో నిలిచిన సొమ్ములు
- సచివాలయాలు, విద్యుత్ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు

ఎంత మంది చదువుకునే పిల్లలు ఉంటే అందరికీ తల్లికి వందనం పథకం కింద ఏడాదికి రూ.15వేలు ఇస్తానంటూ గత ఎన్నికల ముందు చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారు. తీరా గద్దెనెక్కిన తర్వాత తొలి ఏడాది విజయవంతంగా ఎగొట్టేశారు. పాలనకు రెండో ఏడాది ప్రారంభమయ్యాక తొలిసారి అమల్లోకి తెచ్చిన తల్లికి వందనాన్ని నిబంధనల చట్రంలో ఇరికించారు. ఆచరణకొచ్చేసరికి కొర్రీలతో కోతలు పెట్టారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు కూటమి సర్కార్ తీరుపై ఆగ్రహిస్తున్నారు. ఎన్నికలప్పుడు ఒకలా...అధికారంలోకి వచ్చాక మరోలా మాట్లాడటం చంద్రబాబుకు కొత్తేమి కాదని విమర్శిస్తున్నారు.

వీరవాసరం: తల్లికి వందనం పథకం అమలు కర్ణుడి చావుకు సవా లక్షా కారణాలు అన్న చందంగా మారింది. ఈ నెల 12వ తేదిన ఈ పథకానికి సంబంధించి సీఎం చంద్రబాబు నిధులు విడుదల చేశారు. అయితే, 13వ తేది నుంచి తల్లుల ఖాతాలకు సొమ్ములు కావడం ప్రారంభించింది. కొంతమంది తల్లుల ఖాతాలకు సొమ్ములు జమ కాగా, మరికొందరి తల్లుల ఖాతాలకు వేర్వేరు కారణాలతో సొమ్ములు నిలిచిపోయాయి. నిబంధనలకు మించి విద్యుత్ వినియోగం 300 యూనిట్లకు మించి కరెంటు బిల్లు రావడం, కుటుంబంలో రూ.12వేలకు మించి జీతం తీసుకుంటున్న వారు ఉండటం, సరైన ఆదాయ ధృవీకరణ లేకపోవడం, నాలుగు చక్రాల వాహనాలు కలిగి ఉండటం వంటి కారణాలతో తల్లికి వందనం సొమ్ములు జమ కాలేదని తెలుస్తోంది. అద్దె ఇళ్లల్లో ఉన్న వారికి సైతం సొమ్ములు పడలేదని సమాచారం. గతంలో అద్దె ఇళ్లల్లో ఉన్న సమయంలో ఇంటి యజమాని విద్యుత్ సర్వీస్‌కు అద్దె ఇంటిదారుల మొబైల్ నెంబరు లింకు కావడం, ప్రస్తుతం ఆ బిల్లు ఎక్కువగా రావడం వంటి కారణాలు తల్లికి వందనం సొమ్ములు జమ కాకపోవడానికి కారణాలుగా తెలుస్తున్నాయి. ఏడాది కాలానికి విద్యుత్ వినియోగం చూడవలసి ఉండగా, ఆరు నెలలకు మాత్రమే చూశారని పలువురు లబ్ధిదారులు పేర్కొంటున్నారు. నిబంధనలకు మించి విద్యుత్ వినియోగం ఉండటమే కారణంగా తల్లికి వందనం ఆగినట్లుగా తెలుస్తోంది. పలువురికి విద్యుత్ బిల్లు నిబంధనల మేరకు ఉన్నా వేర్వేరు కారణాలతో ఆగినట్లుగా సమాచారం. పదో తరగతి పూర్తయిన పలువురు విద్యార్థులకు సొమ్ములు జమ కాలేదని తెలిసింది.

తల్లికి వందనం గండాలివే..

తల్లికి వందనం పథకానికి అర్హులు కాలేని వారి తాలూకా లిస్టును సచివాలయాల్లో ఉంచారు. లబ్ధి అందని ప్రజానీకం ఆయా సచివాలయాలకు వచ్చి లిస్టులో తమ పేరు పక్కన ఎందుకు రాలేదో తెలుసుకుని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికంగా విద్యుత్ వాడకం కాగా, వెయ్యి చదరపు గజాల స్థలం దాటి ఉండడం, ఆదాయపు పన్ను చెల్లింపు, కుటుంబసభ్యుల్లో ఒకరికి నాలుగు చక్రాల వాహనం ఉండడం, ఆదాయానికి తగిన ధ్రువపత్రం లేదని ఇలా పలు కారణాలతో అధికసంఖ్యలో తల్లికి వందనం అందుకోలేని వారి సంఖ్య ఉంది. దీంతో ప్రజానీకం హామీలు ఇవ్వడమెందుకని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



వీరవాసరంలో సచివాలయం (ఫైల్)

ఆంక్షలు పెట్టడం సరికాదు



రాయకుదురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మా ఇద్దరు కుమార్తెలు చదువుతున్నారు. తల్లికి వందనం పేరుతో కూటమి ప్రభుత్వం అందజేసిన లబ్ధి నాకు చేకూరలేదు. వివిధ కారణాలు చూపించి చాలా మంది తల్లులకు తల్లికి వందనం ఇవ్వడంలేదు. ముఖ్యంగా విద్యుత్ బిల్లులో 300 యూనిట్‌లను చూపించి అనర్హులుగా మార్చేస్తున్నారు. చాలా మంది అర్హులు మాకు అందలేదంటూ బాధపడుతున్నారు.

–తోట పెద్దిరాజు, రాయకుదురు

ఆరు ఎకరాల పొలం ఉన్నట్లు చూపించారు



తనకు సొంత ఇల్లు లేదు. నా ఇద్దరు కుమార్తెలు తణుకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్నారు. అయితే, తన పేరున ఆరు ఎకరాలు పొలం ఉన్నట్లుగా చూపించారు. దీంతో తన ఇద్దరు పిల్లలకు తల్లికి వందనం సొమ్ములు జమ కాలేదు. గత ప్రభుత్వంలో తన కుమార్తెకు అమ్మ ఒడి కింద సొమ్ములు జమ అయ్యాయి. ప్రస్తుతం ఒక్కరికి కూడా సొమ్ములు రాలేదు. ప్రభుత్వం తప్పులను సరిచేసి నిజమైన లబ్ధిదారులకు సొమ్ములు జమ అయ్యేలా చూడాలి.

–గేదెల సరిత, వీరవాసరం

పోలేరమ్మకు విరాళం అందజేత



ఆలయ నిర్మాణానికి విరాళం అందజేస్తున్న దాతలు

కాళ్ల: కాళ్ల మండలం సీసలి గ్రామంలోని నూతనంగా ప్రతిష్ఠించిన పోలేరమ్మ అమ్మవారిని ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు, టీడీపీ జమ్మలమడుగు ఇంచార్జి భూపేష్ రెడ్డి ఆదివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయ నిర్మాణానికి పలువురు విరాళాలు అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కట్రెడ్డి శ్రీనివాసరావు, నూకల భోగేంద్రబాబు, వాస్మూరి శ్రీనివాసరావు, తోట రామదాసు, కట్రెడ్డి భాస్కరరావు, గణేశ్న పద్మారావు, నల్లశ్రీను తదితరులు పాల్గొన్నారు.

యువత పోరు విజయవంతం చేయాలి



పెద అమీరం పార్టీ కార్యాలయంలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

కాళ్ల: కూటమి నాయకులు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా యువతను మోసం చేశారని, ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ ఈనెల 23న వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో యువత పోరు పేరుతో నిరసన కార్యక్రమం నిర్వహించనున్నట్లు పార్టీ యువజన విభాగం నాయకులు తెలిపారు. కాళ్ల మండలం పెద అమీరం పార్టీ క్యాంపు కార్యాలయంలో ఆదివారం యువత పోరు పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏటా జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని, ప్రతి నెలా నిరుద్యోగ భృతి చెల్లిస్తామంటూ గొప్పగా ప్రచారం చేసిన టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు అధికారం చేపట్టి ఏడాది పూర్తయినా యువతకు ఇచ్చిన ఒక్క వాగ్దానం అమలు చేయలేదన్నారు. ప్రభుత్వం కళ్లు తెరిపించి యువతకు ఇచ్చిన హామీల అమలుకు తాము నిరసన బాటపట్టనున్నట్లు చెప్పారు. ఉండి నియోజకవర్గం నుంచి వైఎస్సార్ సీపీ యువజన విభాగం నాయకులు, కార్యకర్తలు, నిరుద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యువజన విభాగం నాయకులు డొక్కు సుబ్రమణ్యం, పార్టీ నాయకులు పెనుమత్స దుర్గాప్రసాద్ రాజు, నంద్యాల సీతారామయ్య, గణేశ్న రాంబాబు, కొండేటి శివకుమార్, వేగేశ్న జయరామకృష్ణంరాజు, మంతెన సునీల్ వర్మ, అంబటి రమేష్, నరేంద్ర వర్మ, గుండు నాగేశ్వరరావు, పెనుమత్స రంగరాజు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

యువత పోరుకు తరలిరండి

ఉండి: ఉండి మండలంలోని వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, యువత, కార్యకర్తలు సోమవారం పార్టీ యువజన విభాగం ఆధ్వర్యంలో నిర్వహించే యువత పోరులో పాల్గొనాలని పార్టీ మండలాధ్యక్షుడు పీవీఆర్‌కే ఆంజనేయరాజు తెలిపారు. అందరూ ఉదయం 9 గంటలకు కాళ్ళ మండలం పెదఅమిరం గ్రామంలోని పార్టీ నియోజకవర్గ కార్యాలయానికి తరలిరావాలని తెలిపారు.అక్కడ నుంచి కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి మెమొరాండం ఇచ్చేందుకు గాను భీమవరం శివారులోని విస్సాకోడేరు వంతెన వద్దకు చేరుకుంటామని తెలిపారు. కాబట్టి యువత, నాయకులు నియోజకవర్గ కార్యాలయానికి సమయానికి తరలిరావాలని ఆంజనేయరాజు కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భీమవరం: భీమవరం ఇండస్ట్రియల్ ఏరియాలోని విద్యుత్ ఉపకేంద్రము పరిధిలో కొత్త విద్యుత్ తీగల మార్పిడి నిమిత్తం సోమవారం ఉదయం 9గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్. వెంకటేశ్వరరావు తెలిపారు. నరసయ్య అగ్రహారంలోని పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు సహకరించాలని కోరారు.

కాళ్ల: కాళ్ల మండలం బోస్ కాలనీ 33/11 కెవి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో నూతన 11 కెవి లైన్ ఏర్పాటు పనులు నిమిత్తం సోమవారం ఉదయం 7 గంటలు నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మాలవానితిప్ప, గోగుతిప్ప, ఆనందపురం, ఇసుకల్లంక, మేకలదిబ్బ, గూట్లపాడు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్.వెంకటేశ్వరరావు శనివారం తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

24న నాడు-నేడు అంశంపై సెమినార్

భీమవరం: ఈ నెల 24వ తేదీన మంగళవారం ప్యాడీ అండ్ రైస్‌మర్చంట్స్ హాలు, భీమవరంలో ఎమర్జన్సీ నాడు-నేడు అనే అంశంపై సెమినార్ నిర్వహిస్తున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి గోపాలన్ తెలిపారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం కార్పొరేటర్లకు కొమ్ము కాస్తుందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేసేలా ప్రవేటీకరణ పెరిగిపోయిందన్నారు. ఈ సమావేశంలో కేంద్ర కమిటీ సభ్యురాలు రమాదేవి, రాష్ట్ర నాయకులు పాల్గొంటారని తెలిపారు.

ఘనంగా మావుళ్లమ్మ జాతర

భీమవరం (ప్రకాశంచౌక్): పట్టణంలోని భీమవరం 36వ వార్డులోని రామరాజుతోటలో మావుళ్లమ్మ 40వ జాతక మహోత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) ప్రత్యేక పూజలను చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామాంజనేయులు మాట్లాడుతూ గ్రామ శాంతి కోసం మన పూర్వీకులు ఏర్పాటు చేసిన గ్రామ దేవతల జాతర మహోత్సవాలను భావితరాలకు తెలియజేప్పే విధంగా సాంప్రదాయబద్ధంగా నిర్వహించుకోవాలన్నారు. 40 సంవత్సరాలుగా జాతర మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్న మావుళ్లమ్మ సేవా సమితి సభ్యులను ప్రత్యేకంగా అభినందించారు. అమ్మవారిని డీఎస్పీ జయసూర్య దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో సమితి అధ్యక్ష ,కార్యదర్శులు రామాయణం వెంకటలక్ష్మి తులసి పార్వతి, రేవూరి గోగురాజులు, చింతలపాటి బంగారు రాజు, పంజా లక్ష్మణ రావు, కోరసిక వెంకటేశ్వరరావు, కొండేపూడి గణపతి, అల్లు శ్రీనివాసులు పాల్గొన్నారు. ఈ జాతరలో గరగ నృత్యాలు, తీన్మార్ డప్పు వాయిద్యాలు, శక్తి వేషాలు, బుట్ట బొమ్మలు, అందర్నీ అలరించాయి. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



తుందుర్రు గ్రామంలో వైద్య శిబిరంలో రోగులకు పరీక్షలు చేస్తున్న దృశ్యం

భీమవరం అర్బన్: గ్రామాలలో ఏర్పాటు చేస్తున్న ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ ఆరేటి వీరాస్వామి నాయుడు (పెద్దబ్బు) అన్నారు. భీమవరం మండలంలోని తుందుర్రులో హైస్కూల్ ప్రాంగణంలో ఆదివారం మిత్ర మెడికల్ హాస్పటల్ ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్లు చుండూరి సాయిబాబు, డాక్టర్ విక్రాంత్, డాక్టర్ ప్రియాంక, డాక్టర్ మురళీ, డాక్టర్ సుమ,డాక్టర్ ప్రశాంత్ నాయుడు, డాక్టర్ మురళీ ఆరేటిలు రోగులకు వైద్య పరీక్షలు చేశారు. బీపీ, సుగర్, ఈసీజీ పరీక్షలను ఉచితంగా చేశారు. డాక్టర్ ఆరేటి మురళీ మాట్లాడుతూ తన స్వగ్రామం తుందుర్రు అని, గ్రామ ప్రజలకు తన వంతు సాయంగా ఉచితంగా వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తున్నానన్నారు. అనంతరం డాక్టర్లను గ్రామస్తులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో తాడేరు సొసైటీ మాజీ చైర్మన్ ఆరేటి అబ్బులు, కొట్టు సురేష్, కొట్టు త్రినాథ్, ఎంపీటీసీ ఆరేటి వాసు, జక్కంపూడి బాబ్జి, ఆరేటి చంద్రరావు, చీడే నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నడకతో ఆరోగ్యం

భీమవరం: ప్రతిరోజూ నడవడం వల్ల శరీరానికి, మనస్సుకు ఎన్నో ప్రయోజనాలు కలుగుతాయని, గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడమే కాకుండా ఒత్తిడిని తగ్గిస్తుందని వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ ఎం ప్రభావతి అన్నారు. భీమవరం డీఎన్నార్ లైబ్రరీ సెమినార్ హాల్లో ఆదివారం వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ -201, 3వ క్యాబినెట్ సమావేశాన్ని నిర్వహించారు. ముందుగా వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ ప్రభావతి, గవర్నర్ (డిస్ట్రిక్ట్ -201) గుంటూరి రామరాజు, పాస్ట్ గవర్నర్స్, జ్యోతి ప్రజ్వలన చేశారు. ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ ప్రభావతి మాట్లాడుతూ నడకతో ఆర్యోగం పొందవచ్చనే ఆలోచన సంకల్పంతో వాకర్స్ ఇంటర్నేషనల్ సంస్థ ఏర్పాటు అయ్యిందని, లక్షలాది మంది సభ్యులు వాకర్స్ ఇంటర్నేషనల్‌లో ఉన్నారని, జిల్లాల వారీగా గవర్నర్, సభ్యులను ఎన్నుకొని వాకర్స్ ఇంటర్నేషనల్ సంస్థ బలోపేతానికి కృషి చేస్తున్నామని అన్నారు. గవర్నర్ (డిస్ట్రిక్ట్ -201) గుంటూరి రామరాజు మాట్లాడుతూ ఈ ఏడాది జిల్లా వాకర్స్ సంస్థ ద్వారా సేవా కార్యక్రమాలను నిర్వహించి మన జిల్లా ప్రథమ స్థానంలోకి రావడానికి కృషి చేస్తామని అన్నారు. ఈనెల 29వ తేదీన తిరుపతిలో వాకర్స్ ఇంటర్నేషనల్ 163వ కౌన్సిల్ సమావేశం జరుగుతోందని, ఈ సమావేశాన్ని జయప్రదం చేయాలని రామరాజు అన్నారు. వాకర్స్ క్లబ్‌ల ఉన్నతికి అందరూ సహకరించాలని అన్నారు. అనంతరం వాకర్స్ ఇంటర్నేషనల్ సభ్యులను సత్కరించారు. కార్యక్రమంలో వి మురళి మోహన్ రావు, వై సత్యనారాయణ, శనగల కృష్ణమూర్తి, ఎస్ సుబ్బారావు, ఎస్ నాగేశ్వరరావు, వడుపు గోపి, బొండా శ్రీరామ్, పాత గవర్నర్ లు నరసింహ మూర్తి, ఇంద్రకంటి సూర్యారావు, ఆర్. రామకృష్ణ రాజు కటకం వల్లభరావు, పి.సీతారామరాజు, గాదిరాజు కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.



వాకర్స్ ఇంటర్నేషనల్ సమావేశంలో మాట్లాడుతున్న ప్రభావతి

రిటైనింగ్ వాల్ పూడికలో నిర్లక్ష్యం



కాజ పడమరలో రిటైనింగ్ వాల్ మధ్యలో తడికలు పెట్టి పూడుస్తున్న దృశ్యం



మరోచోట సగం గోడకు అడ్డుగా కొబ్బరి చెట్ల మోడులను వేసి పూడుస్తున్న దృశ్యం

యలమంచిలి: కాజ పడమర గ్రామ పరిధిలో చీమలకోడు కాల్వకు రిటైనింగ్ వాల్స్ నిర్మించారు. ఈ కాలువ పక్కనే కరెంటు స్తంభాలు ఉండడంతో అవి ఉన్న చోట ఖాళీ వదిలి మిగిలిన ప్రాంతంలో వాల్ నిర్మించారు. వాల్ నిర్మాణం పూర్తి కావడంతో మధ్య ఖాళీని మట్టితో పూడుస్తున్నారు. అయితే కరెంటు స్తంభాలు ఉన్న చోట వాల్ లేకపోవడంతో అక్కడ కాల్వలో సర్వే కర్రలు పాతి వాటికి అడ్డుగా వెదురు తడికలు పెట్టి మట్టి పూడుస్తున్నారు. కానీ మరొకచోట సర్వే కర్రలు, వెదురు తడికలు లేకుండా కోసేసిన కొబ్బరి చెట్లను అడ్డుగా పెట్టి మట్టి పూడుస్తున్నారు. ఇక్కడ రిటైనింగ్ వాల్ ఎత్తు సుమారు ఎనిమిది అడుగులు ఉండగా సగం ఎత్తు మాత్రమే కొబ్బరి బొండులు పెట్టి మట్టి పూడుస్తున్నారు. దీంతో వేసిన మట్టి వేసినట్లు కాల్వలో పడిపోతుంది. కాంట్రాక్టర్ ఈ విధంగా మట్టి పూడ్చి వెళ్లిపోతే రేపు కాలువలో నీరు ముందుకు పారదని గ్రామస్తులు, రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ కాల్వపై ఆధారపడి సుమారు 300 ఎకరాలు వరి పొలాలు సాగవుతున్నాయి. కాల్వలో మట్టి ఉంటే ఆ రైతులు సాగునీటి కోసం ఇబ్బందులు పడే పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో సంబంధిత అధికారులు స్పందించి వాల్ మధ్య ఖాళీలను సక్రమంగా పూడ్చేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

లక్ష్మీదేవికి పెద్దిబొట్ల బ్రహ్మయ్య పురస్కారం

పాలకొల్లు సెంట్రల్: రచయిత్రి, సాహిత్య విమర్శకులు డాక్టర్ వాడ్రేవు వీర లక్ష్మీదేవి రచనలు, కథా సంకలనాలు మానవ జీవితంలో ప్రేమని, స్వేచ్ఛాకాంక్షని, మృగ్యమైపోతున్న విలువల్ని బలంగా పట్టి చూపిస్తాయని సాహిత్య వ్యాసాల సమీక్షకుడు డాక్టర్ రెంటాల శ్రీవెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం స్థానిక పెద్దిబొట్ల లక్ష్మీనారాయణ, కన్యాకుమారి కాన్ఫరెన్స్ హాల్ లయన్స్ క్లబ్‌లో పెద్దిబొట్ల బ్రహ్మయ్య స్మారక రసధుని సాహితీ పురస్కార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సాహిత్య విమర్శకులు డాక్టర్ వాడ్రేవు వీర లక్ష్మీదేవికి బ్రహ్మయ్య స్మారక పురస్కారం అందించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ వీర లక్ష్మీదేవి సాహిత్య విమర్శ గ్రంథాల గురించి వివరించారు. అనంతరం రసధుని నూతన కమిటీ అధ్యక్షుడు కొట్టి భాస్కరరావు, సెక్రటరీ యర్రంశెట్టి వెంకటరత్నం, కమిటీ సభ్యులతో సలహా మండలి సభ్యులు చేగొండి వివి సత్యనారాయణమూర్తి ప్రమాణ స్వీకారం చేయించారు. రసధుని ట్రెజరర్ ముచ్చర్ల సత్యనారాయణ పాల్గొన్నారు.

విద్యుత్ లోడు క్రమబద్ధీకరణకు రాయితీ

- జూన్ 30తో గడువు ముగింపు
- ఇప్పటిదాకా కేవలం 186 దరఖాస్తులు



ఏపి తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ కార్యాలయం

పాలకొల్లు సెంట్రల్: విద్యుత్ వినియోగంలో అదనపు లోడు వాడుకుంటున్న వినియోగదారులకు ఏపి ఈపీడీసీఎల్ రాయితీ పథకాన్ని అమలుచేస్తుంది. విద్యుత్‌శాఖ ఇచ్చిన విద్యుత్ లోడుకన్నా అదనంగా వాడుకుంటే దాని ప్రభావం ట్రాన్స్‌ఫార్మర్లు, సబ్‌స్టేషన్లపై అధిక భారం పడుతుంటుంది. తద్వారా ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోవడం గృహోపకరణాల్లో విద్యుత్ పేలిపోవడం వంటి సమస్యలు తలెత్తుతుంటాయి. ఇలాంటి సమస్యను పరిష్కరించడానికి ఏపీ ఈపీడీసీఎల్ వినియోగదారుల కోసం క్రమబద్ధీకరణ రాయితీని అందిస్తుంది. విద్యుత్ అదనపు లోడును స్వచ్ఛందంగా క్రమబద్ధీకరించుకునే గృహ వినియోగదారులకు 50 శాతం రాయితీ అందిస్తుంది. ఈ పథకం ఈ సంవత్సరం మార్చి నెల 1 నుంచి అమల్లోకి రాగా ఈ నెల జూన్ 30 తో ముగుస్తున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు చెబుతున్నారు.

విద్యుత్ వినియోగదారులు ఇలా..

పాలకొల్లు నియోజకవర్గంలో మొత్తం గృహ వినియోగదారులు కేటగిరి-1లో పాలకొల్లు 23989, పోడూరు 19699, పూలపల్లి 21592, యలమంచిలి 20227 మొత్తం 85487 మంది వినియోగదారులు ఉన్నారు. వీరిలో అధిక లోడు వాడుతున్న గృహ వినియోగదారులు పాలకొల్లు 2559, పోడూరు 2649, పూలపల్లి 2950, యలమంచిలి 2892 ఉన్నారు. అంటే మొత్తం 11050 మంది ఉన్నారు. ఇప్పటి వరకూ ఈ పథకాన్ని వినియోగించుకున్న వినియోగదారులు పాలకొల్లు 68, పోడూరు 45, పూలపల్లి 45, యలమంచిలి 28 మొత్తం 186 మంది మాత్రమే సద్వినియోగం చేసుకున్నారు. అదనపు విద్యుత్ లోడు క్రమబద్ధీకరణతో ఏ ప్రాంతాల్లో ఎంత వరకూ విద్యుత్ సరఫరా చేయాలో పరిశీలించి దానికి అనుగుణంగా పరికరాలను ఏర్పాటు చేసుకుని అదనపు లోడు సమస్యను పరిష్కరించడానికి విద్యుత్ శాఖ అధికారులకు వెసులుబాటు కలుగుతుంది. ఈ పథకం ద్వారా అదనపు లోడు వాడుకునే వినియోగదారులు క్రమబద్ధీకరణ చేసుకుంటే 50 శాతం రాయితీని అందిస్తున్నారు.

రాయితీ విధానం

సాధారణంగా గృహ వినియోగాదురుల ఒక కిలో వాట్‌కు డెవలప్‌మెంట్ చార్జీలు రూ. 2 వేలు, సెక్యూరిటీ డిపాజిట్ కింద రూ. 200 చెల్లించాల్సి ఉంటుంది. అదే ప్రస్తుతం విద్యుత్ శాఖ అధికారులు కల్పిస్తున్న ఈ పథకం ద్వారా స్వచ్ఛందంగా క్రమబద్ధీకరణ చేయించుకుంటే సెక్యూరిటీ డిపాజిట్‌తో పాటు ధరఖాస్తు ఫీజు గా రూ.50లతో కలిపి రూ. 1250 చెల్లిస్తే సరిపోతుంది. ఇలాంటి సదావకాశం కల్పించినా గాని 11050 మంది అదనపు లోడు వినియోగదారుల్లో స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన వారి సంఖ్య 186 మాత్రమే. గత మూడు నెలలుగా వినియోగదారులకు సమాచారం అందిస్తున్నా గాని స్పందన లేకపోవడం గమనార్హం.

వినియోగదారులకు ఉపయుక్తం



అదనంగా విద్యుత్ వాడుకునే వినియోగదారులకు రాయితీ ఎంతగానో దోహదపడుతుంది. ముఖ్యంగా అధికారులు తనిఖీలు చేస్తారనే భయం, ఆందోళన ఉండదు. ట్రాన్స్‌ఫార్మర్లపై అధిక భారం పడే సమస్య తగ్గుతుంది. తద్వారా నాణ్యమైన విద్యుత్ సరఫరా జరుగుతుంది. దానివల్ల ఇంటిలో విద్యుత్ వస్తువులకు సమస్య లేకుండా ఉంటుంది. స్వచ్ఛందంగా వచ్చి అదనపు లోడు క్రమబద్ధీకరించుకునే వినియోగదారులు ట్రాన్స్‌కో రెవెన్యూ కార్యాలయాలు, మీ సేవ కేంద్రాల్లో ఈపీడీసీఎల్ వెబ్‌సైట్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చు.

– చిటికెన రామకృష్ణ, డీఈఈ, తూర్పు ప్రాంత విద్యుత్ శాఖ,పాలకొల్లు